
నమస్తే తెలంగాణ
# జనగామ
5 | శుక్రవారం 22 మార్చి 2024 | JANAGAON



ఎల్బీ కాలేజీలో బాస్కెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

## 'ఎల్బీ'లో గోల్డెన్ జూబ్లీ క్రీడా పోటీలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 21: లాల్‌బహదూర్ కాలేజీలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ అరుణ ప్రారంభించారు. కబడ్డీ, బాస్కెట్‌బాల్, 2.5 కిలోమీటర్స్ రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు, పోటీల్లో ఎన్ఐటీ, కిట్స్, ఎస్సార్ యూనివర్సిటీ, కేయూ బీపీడీ, యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ, కాకతీయ డిగ్రీ కాలేజ్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ మహబూబాబాద్, వాగ్దేవి డిగ్రీ కాలేజ్ తదితర జట్లు పాల్గొన్నాయని ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, అధ్యాపకులు రమణారెడ్డి, రాజేశ్వరరావు, శృతి, రజిని, రాఘువేందర్‌రెడ్డి, సదానందం, రవీందర్, రాధిక పాల్గొన్నారు.



# హస్తంలో సీటు పొట్లు..

వరంగల్ ఎంపీ టికెట్‌కు పోటాపోటీ

ఎవరికివారే అధిష్ఠానంతో మంతనాలు

'నాకే పక్కా' అంటున్న ఏడుగురు..

- వర్గాలుగా విడిపోయి ఏఐసీసీ స్థాయిలో ప్రయత్నాలు
- ప్రకటన ఆలస్యమైన కొద్దీ పెరుగుతున్న ఆశావహులు
- రెండో జాబితాలోనూ లేని వరంగల్ పేరు



*వరంగల్, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిని తేల్చడం కాంగ్రెస్‌కు కత్తిమీద సాములా మారింది. ఇక్కడ ఏకంగా ఏడుగురు పోటీ పడుతుండడం ఆ పార్టీకి తలబొప్పికట్టిస్తోంది. అభ్యర్థి ప్రకటన ఆలస్యమైన కొద్దీ ఆశావహులు పెరుగుతుండగా ఎవరికివారే ఏఐసీసీ స్థాయిలో మంతనాలు జరుపుతుండడం కార్యకర్తలను అయోమయంలో పడేస్తున్నది. ''టికెట్ నాకంటే.. నాకు' అనే ధీమా పోటీదారులందరిలోనూ కనిపిస్తుండగా, ఆ పార్టీ గురువారం విడుదల చేసిన రెండో జాబితాలోనూ వరంగల్ పేరు లేకపోవడం మరింత ఉత్కంఠ రేపుతున్నది.*

కాంగ్రెస్‌లో వరంగల్ లోక్‌సభ టికెట్ పంచాయితీ తెగడంలేదు. ఎన్నికలు సమీపిస్తున్నా ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదు. ఆలస్యమవుతున్న కొద్దీ పార్టీలో పంచాయితీలు పెరుగుతున్నాయి. అధికార పార్టీ కాబట్టి అనుకూలత ఉంటుందనే ఉద్దేశంతో ఎక్కువ మంది నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అధిష్ఠానం వద్ద ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కాగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన ఇప్పట్లో ఉండబోదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడ్డప్పుడే ప్రకటిస్తారని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న రానుండగా వరంగల్ స్థానంపై ఇప్పటికే ఏడుగురు నేతలు ధీమాతో ఉన్నారు. టిక్కెట్ కచ్చితంగా తనకే వస్తుందని ఎవరికివారు భావిస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నవారిలో సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, శనిగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య, రామగల్ల పరమేశ్వర్, బక్క జడ్సన్, జన్ను పరంజ్యోతి, నమిండ్ల శ్రీనివాస్ ఉన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మంత్రి అండదండలతో ఎవరికి వారు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో ఇతర నేతలకు రాకుండా చేస్తున్నారు. ఈ పరిణామాలతో నాయకులు, కార్యకర్తలు అయోమయానికి లోనవుతున్నారు.

కాంగ్రెస్ తరపున 2019 ఎన్నికల్లో పోటీ చేసిన దొమ్మాటి సాంబయ్య టికెట్‌పై ధీమాతో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితుడిగా ఆయనకు పేరుంది. సాంబయ్య గత ఎన్నికల్లో పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో సాంబయ్యకు 2,62,200 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు పోటీ చేసిన తనకు ఇప్పుడు అవకాశం వస్తుందని భరోసాతో ఉన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శనిగపురం ఇందిర వరంగల్ ఎంపీ సీటు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. లోక్‌సభ సీట్లలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్, బీజేపీ రెండు స్థానాలను మహిళలకు ఇచ్చాయని, కాంగ్రెస్ సైతం ఇదే తరహాలో తనకు అవకాశం ఇస్తుందని ఇందిర ఆశాభావంతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్నం సునీతామహేందర్‌రెడ్డి పేరును మల్కాజ్‌గిరి, చేవెళ్ల సీట్లలో ఒకదానికి అభ్యర్థిగా పరిశీలిస్తున్నది. మరో సీటును మహిళకు కేటాయించే అవకాశం ఉన్నదని ఇందిర ధీమాతో ఉన్నారు.

వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. టికెట్ హామీతోనే ఆయన హస్తం పార్టీలో చేరినట్లు పసునూరి సన్నిహితులు చెబుతున్నారు. ఆయన బీఆర్ఎస్ తరపున రెండుసార్లు గెలిచారు. 2015 ఉప ఎన్నికలో 4,59,233 ఓట్ల రికార్డు మెజారిటీతో విజయం సాధించారు. 2019 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా 3,50,298 ఓట్ల మెజారిటీతో గెలిచారు. వరుసగా రెండుసార్లు గెలిచిన నేపథ్యం ఉండడం, సిట్టింగ్ ఎంపీగా అధికార పార్టీలో చేరడంతో ఈసారి తనకు అవకాశం వస్తుందని దయాకర్ ఆశాభావంతో ఉన్నారు.

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్‌ను రామగళ్ల పరమేశ్వర్ సైతం ఈ సారి ఆశిస్తున్నారు. 2009లో బీఆర్ఎస్ తరపున, 2014లో బీజేపీ తరపున పోటీ చేసిన ఆయన, రెండు ఎన్నికల సానుభూతితో కాంగ్రెస్ పార్టీ ఈసారి తనకు అవకాశం ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్ తన విధేయతను కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తిస్తుందని, ఈసారి తనకే టిక్కెట్ వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. వర్ధన్నపేట అసెంబ్లీ టికెట్‌ను వదులుకున్న తనకు వరంగల్ లోక్‌సభ టికెట్ వస్తుందని నమిండ్ల శ్రీనివాస్ ధీమాతో ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ద్వారా టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన జన్ను పరంజ్యోతి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మంత్రి అండదండలతో కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల

# సర్కారు దవాఖానలో ఫార్మాసిస్ట్ చేతివాటం

- రోగులకు అందించాల్సిన మందులను బహిరంగ మార్కెట్‌లో విక్రయం
- ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో దందాను బట్టబయలు చేసిన అధికారులు, పోలీసులు
- రూ. 81 వేల విలువైన మందులు సీజ్.. ఇద్దరిపై కేసు నమోదు

వరంగల్ చౌరస్తా, మార్చి21: సర్కారు దవాఖానలో ఫార్మాసిస్ట్ చేతివాటం ప్రదర్శించాడు. ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో రోగులకు అందించాల్సిన మందులను బహిరంగ మార్కెట్‌లో విక్రయించాడు. టాస్క్‌ఫోర్స్ అధికారులు పోలీసులతో కలిసి దాడులు చేయడంతో బండారం బట్టబయలైంది. పోలీసులు, డ్రగ్ కంట్రోలర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు తలకోటి నరేందర్ (ఈనాడు మాజీ రిపోర్టర్) వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఓపీ ఫార్మాసిస్ట్‌గా సుమారు 33 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. దవాఖానలో ఎక్కువ మంది ఓపీ సేవలు వినియోగించుకున్నట్లు, వారికి వైద్య పరీక్షల అనంతరం వైద్యులు సూచించిన మందులను రెండింతలు నమోదు చేసి ఉచితంగా పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశాడు. మిగిలిన మందులను గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు చెందిన బలరాందాసు ద్వారా బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నాడు. బుధవారం వరంగల్ జిల్లా డ్రగ్ కంట్రోలర్ అరవింద్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఇంతేజార్‌గంజ్ పోలీసుల సహకారంతో నిర్వహించిన దాడుల్లో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులు తలకోట నాగేందర్, బలరాందాసును అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పక్కదారి పట్టించిన మందులను కాశీబుగ్గలో నిల్వ చేసి అక్రమంగా బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్లు తేలింది. రూ. 69,360 విలువైన 34 బాక్సుల యాంటీ బయాటిక్ టాబ్లెట్స్, రూ. 11, 484 విలువైన 240 కంటి చుక్కల మందు బాటిల్స్, మొత్తం సుమారు రూ. 80, 844 విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు.



డ్రగ్ కంట్రోల్ అధికారులు చేపట్టిన దాడుల్లో పట్టుబడిన నిందితులు బలరాం దాసు, తలకోటి నరేందర్

### అధికారుల పర్యవేక్షణ లోపం

ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఓపీ ఫార్మాసిస్ట్ బాగోతం బట్టబయలు కావడంతో హాస్పిటల్‌లో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నిత్యం కంటి పరీక్షలు నిర్వహించి, రోగులకు అందించే మందుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉన్నా అధికారులు తగిన శ్రద్ధ చూపకపోవడంతోనే మందులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా కాలంగా మందులు పక్కదారి పడుతున్నా గుర్తించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి మందులు బహిరంగ మార్కెట్‌కు తరలకుండా చూడాలని రోగులు కోరుతున్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు



ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు

మహబూబాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏళ్ల వయసు పైబడిన వారితో పాటు దివ్యాంగ ఓటర్లకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించింది. మే 13న మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకోసం ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పార్లమెంటు పరిధిలో ఉండే వృద్ధులతో పాటు దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేయవచ్చు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 10,724 మంది ఉండగా, 33,56 దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. ఇంటి నుంచి ఓటు వేయాలనుకునే వారి నుంచి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణను అధికారులు ప్రారంభించారు. అర్హులైన వారు వచ్చే నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి వద్ద ఓటు వేయాలనుకునే వారు ఫారం-డీ నింపి ఇవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శి, బూతు లెవల్ అధికారి(బీఎల్‌వో) వద్ద అందుబాటులో ఉన్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్‌కు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన నాలుగు రోజుల తర్వాత హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలింగ్ సిబ్బంది స్వయంగా ఇంటికి వచ్చి ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేస్తారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల వివరాలను ఎన్నికల అధికారులు ఇప్పటికే గుర్తించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దివ్యాంగుల ఓట్లు ఇలా ఉన్నాయి. డోర్నకల్ 6,364, మహబూబాబాద్ 7,178, నర్సంపేట 6,075, ములుగు 4,291, పినపాక 3,695, ఇల్లందు 3,510, భద్రాచలం 2393 కలిపి మొత్తం 33,506 ఓట్లు ఉన్నాయి.


**85 ఏళ్లు దాటిన వృద్ధుల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| డోర్నకల్ | 501 | 805 | 1306 |
| మహబూబాబాద్ | 787 | 1181 | 1968 |
| నర్సంపేట | 667 | 1223 | 1890 |
| ములుగు | 555 | 1033 | 1588 |
| పినపాక | 474 | 779 | 1253 |
| ఇల్లందు | 697 | 1231 | 1928 |
| భద్రాచలం | 284 | 507 | 791 |
| మొత్తం | 3,965 | 6,759 | 10,724 |

# టెన్త్ పేపర్ లీకైనట్లు పుకార్లు

- ఆందోళన చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఏమీ లేదని తేల్చిన అధికారులు

ములుగు, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలో టెన్త్ ఇంగ్లిష్ పేపర్ బయటికి వచ్చినట్లు పుకార్లు షికారు చేశాయి. ఈ విషయం పోలీసులకు చేరడంతో తీవ్ర కలకలం రేగింది. వివరాల్లోకి వెళ్తే.. ములుగులోని ఓ పరీక్ష కేంద్రం నుంచి జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆంథోని అనే ప్రైవేట్ స్కూల్‌కు ఇంగ్లిష్ ప్రశ్నపత్రం చేరిందని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడు కుమ్మరి సాగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై వెంకటేశ్వర్ హుటాహుటిన సంబంధిత పాఠశాలకు చేరుకొని తనిఖీలు చేయగా ప్రశ్నపత్రాలు లభించలేదు. సమాచారం ఇచ్చిన సాగర్‌ను అడుగగా




అరవింద పాఠశాల కరస్పాండెంట్ అక్కల సతీశ్ తనకు చెప్పాడని తెలియజేయగా సాగర్‌తో కలిసి ఎస్సై అరవింద పాఠశాలకు వెళ్లి తనిఖీలు చేసి విషయంపై ఆరా తీశారు. కాగా, పోలీసుల విచారణలో పేపర్ బయటకు రాలేదని తేలడంతో సాగర్‌తో పాటు పాఠశాలల యాజమాన్యాలను ఎస్సై మందలించారు. ఇలాంటి విషయాల్లో కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పేపర్ నిజంగానే బయటికి వస్తే తనకు గాని, పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా నిబంధనల మేరకు పరీక్షలు జరుగుతున్నాయని, ప్రశ్నపత్రం బయటకు వెళ్లే సమస్య లేదన్నారు. ఇంగ్లిష్ ప్రశ్నపత్రం బయటకు వచ్చిందనడంలో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల పోటీతత్వం కారణంగా ఈ వదంతులు వచ్చాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా, ఈ విషయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలు ప్రశాంతంగా పరీక్షలు రాస్తుంటే ఇలాంటి పుకార్లు ఏంటని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# అటు ఆందోళన.. ఇటు అభినందన

- కాంగ్రెస్‌లో తారాస్థాయికి గ్రూపు తగాదాలు
- కృష్ణమూర్తి కోసం టవరెక్కిన అనుచరుడు
- గంట పాటు హల్‌చల్
- నూతనాధ్యక్షుడికి శ్రేణుల సన్మానం
- ఝాన్సీరెడ్డిపై ఫిర్యాదు చేస్తానన్న పెద్ది



దేవరుప్పులలో కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరామ్

దేవరుప్పుల, మార్చి 21 : దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీలో మూడో రోజైన గురువారం గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరాయి. ఒకవైపు నూతన అధ్యక్షుడికి శ్రేణులు అభినందన సభ ఏర్పాటు చేయగా, మరోవైపు పెద్ది కృష్ణమూర్తి వర్గం ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పెద్ది అనుచరుడు ఉప్పుల బాబు సెల్ టవర్ ఎక్కగా, అటు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు నల్లా శ్రీరామ్‌ను సన్మానించారు.

### సెల్ టవరెక్కి హల్‌చల్..

పదవి కోల్పోయిన పెద్ది కృష్ణమూర్తి అనుచరుడు, దేవరుప్పులకు చెందిన ఉప్పుల బాబు బస్టాండ్ ప్రాంతంలోని సెల్ టవర్ ఎక్కి గంటపాటు హల్‌చల్ చేశారు. కృష్ణమూర్తికి తిరిగి అధ్యక్ష పదవి అప్పగించాలని, ఎమ్మెల్యే యశస్విని వచ్చే వరకు టవర్ దిగేది లేదని స్పష్టం చేశాడు. ఎస్సై చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది ఎంత నచ్చజెప్పినా ససేమిరా దిగనంటూ మొరాయించాడు. చివరకు పెద్దితో ఫోన్‌లో మాట్లాడించగా ఆయన ఆదేశం మేరకు కిందికి దిగాడు.

### పెద్దిపై అనేక ఆరోపణలు

అభినందన సభలో నూతన అధ్యక్షుడు నల్లా శ్రీరామ్ మాట్లాడుతూ పెద్ది కృష్ణమూర్తి మీద రెండు నెలలుగా అనేక ఆరోపణలు వచ్చాయని, ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో పాటు కాంగ్రెస్ నియోజక ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడం వల్లనే అతడిని తొలగించాల్సి వచ్చిందన్నారు. మండలంలోని 28 గ్రామాల పార్టీ అధ్యక్షులు పెద్దిని తొలగించాలని ఏకగ్రీవంగా తెలపడమే కాకుండా లిఖితపూర్వకంగా రాసిచ్చారని చెప్పారు. ఇది మింగుడుపడని పెద్ది ఎమ్మెల్యేపై అనేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కలిసి వస్తే స్వాగతిస్తామని, తాను అందరినీ కలుపుకుపోతానని ఆయన నాయకులు, కార్యకర్తలకు తెలిపారు.

### ఝాన్సీరెడ్డిపై ఫిర్యాదు చేస్తా


అధ్యక్ష పదవి నుంచి తొలగించిన విషయమై పెద్ది కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి తనకు సమాచారం లేదని చెప్పారన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో ఉన్నారని, ఆయన రాగానే కలుసుకొని దేవరుప్పుల పరిస్థితి, ఝాన్సీరెడ్డి తీరుపై ఫిర్యాదు చేస్తానని పెద్ది తెలిపారు.

# జల్సాల కోసం విద్యుత్ మోటర్ల చోరీ

పరకాల, మార్చి 21: జల్సాలకు అలవాటు పడి విద్యుత్ మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.14.19లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. హనుమకొండకు చెందిన బండారి అనిల్ ఐటీఐ పూర్తి చేసి మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించడానికి టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేటకు చెందిన మాటూరి అరవింద్‌తో కలిసి మోటర్లను దొంగిలించారు. అనంతరం ఒక మైనర్, మొగుళ్లపల్లి మండలం కొర్కిశాలకు చెందిన సరిగొప్పుల సాయితేజ, కమలాపురం హరీశ్‌ను కలుపుకుని మరిన్ని మోటర్లు దొంగిలించారు. వీరు హనుమకొండలో సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను కిరాయికి తీసుకుని పరకాల, దామెర, మొగుళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లోని పలు గ్రామాల్లో ఎస్సారెస్పీ కాల్వ, బావుల వద్ద ఉన్న మోటర్లను దొంగిలించేవారు. నడికూడ మండల శివారులో పరకాల పోలీసులు తనిఖీ చేస్తుండగా వారి కారులో 6 విద్యుత్ మోటర్లు కనిపించాయి. వారిని విచారించగా దొంగిలించిన మోటర్లను హుజూరాబాద్‌కు తరలించి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. 5 మోటర్లు, 57 కేజీల కాపర్ వైరు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కార్లు, రూ.41 వేల నగదును స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు భాస్కర్, కృష్ణకుమార్, దేవేందర్, కే నాగరాజు, డీ నాగరాజు, భాస్కర్, హోంగార్డులు సుధాకర్, రామన్న, రవీందర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీసీ రమేశ్

# ఆధ్యాత్మికతతో మానసిక పరిపక్వత

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : ఆధ్యాత్మికతతో మానసిక పరిపక్వత సాధ్యమని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. సెనేట్ హాల్‌లో గురువారం రిజిస్ట్రార్ మల్లారెడ్డి అధ్యక్షతన ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చాలా ఒత్తిడిలో ఉన్నారని, సవాళ్లను ఎదుర్కోవాలంటే ప్రశాంత జీవితం, సవ్యమైన ఆలోచనా సరళి ఉండాలన్నారు. మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య మాట్లాడుతూ ధ్యానంతో మనస్సు, హృదయాన్ని సమన్వయపర్చొచ్చన్నారు. యూఎస్ఏ నుంచి వచ్చిన డాక్టర్ అరిహంత మాధవమోహన్ మాట్లాడుతూ.. అంతర్గత శాంతి ద్వారా బహిర్గత శాంతి వస్తుందన్నారు. లోకల్ ఇన్‌చార్జ్ శారద, రమణ, అచ్చయ్య పాల్గొన్నారు.